


# నా కాజుయల్ లీవు

(శ్రీ జానకిరాం పట్నాయక్)

"ఏమండీ!"

"..........."

"ఏమండోయ్"

"..........."

"వినిపించదండీ'" అంటూ, కుర్చీ మీద కూచుని, ఆఫీసు కాగితాలు చూస్తూన్న నన్ను, అంకిలి పెట్టింది మా స్వర్ణలత.

"ఎందుకూ?" అన్నాను.

"ఏమిటంత దీక్షగా చూస్తున్నారు?"

"ఆఫీసు కాగితాలు"

"బస్! అస్తమానూ ఆఫీసు కాగితాలేనా? చూడండి! వారం రోజులై వచ్చింది! ముచ్చటగా మూడుమాటలేనా లేదుగా ఒకనాడైనా!"

"ఏం జెయ్యమంటావు? నీతో ముచ్చటలాడుతూ కూచుంటే మరి ఆఫీసుముచ్చట ఎవరు చూస్తారు?"

"ఏం? ఆలుమగలూ ముచ్చటాడ కూడదని అరి కడుతుందా ఏమిటి మీ ఆఫీసు కాగితాలు? ఇనిస్టిట్యూటుకు వెళ్లడానికి, సినీమాలకు వెళ్లడానికి అడ్డుచెప్పదు కాబోలు"

కలం బల్లమీదపడేసి "స్వర్ణా! ప్రొద్దస్తమానం వచ్చేపోయే మనుష్యుల్తోటీ సరిపోతూంది నాపని, వాళ్లను సంతృప్తిపర్చకపోతే, వాళ్లు అడిగిన వాటిని సమాధానాలు యివ్వకపోతే, వర్కుషాపు బయట పడీ సరికి ఎవడు నాలుగు తగల్నిస్తాడో అన్న భయం! తరువాత మా పెదబాబుగారి పురమాయింపులు సరిజేస్తేనేతప్ప లేకపోతే మర్యాదగా ఉండదు. పిమ్మట, నా సంబంధంవైన కాగితాలు ఏనాటివి ఆనాడు పరిష్కరించకపోతే దొరగారు హుంకరిస్తారు, వార్నింగ్ నోటీసు' జారీచేస్తామని కాని అవి పరిష్కరించటం ఏలా? టైము ఎక్కడ? అందుకని ఇంటికి తేవడం జరుగుతూంది. ఇక ఇనిస్టిట్యూటు సినీమాలా? మొద్దుబారిపోయి, వేడి ఎక్కిపోయి ఉంటుంది మనస్సు ఈ పగలంతా పడిన పాటువల్ల. దాన్ని చల్లదనంజేసి, స్థాయిలోనికి తేవడానికి—"

పూర్తి కానీయకుండానే "ఔనులెండి! మనస్సును స్థాయిలోనికి తేవడానికి సినీమా ఇనిస్టిట్యూటులే గాని మరి భార్యాపిల్లలు పనికిరారన్నమాట" అని అందుకుంది.

"సరే! ఇకనుంచి నీ మాట ప్రకారం జరిపిస్తా!"

"పోనీ కాని, ఏవో నాలుగు ముక్కలు వ్రాయటానికి ఇంతటైము ఎందుకు తీసుకుంటారండీ! ఎంతో చదువుకున్నారు కదా—పత్రికలకు కథలు వ్రాస్తూంటారుకదా."

"భేష్! ఇవి ఆఫీసు కాగితాలు! మరేంవీ కాదు. పోయి దగ్గర కూచొని వండడం అనుకున్నావా ఏంటి?"

"ఓహో! వంట అంతసులభం అనుకున్నారా? మీలాంటి చదువుకొన్న మగాళ్ళు పదిమందీ కలిసి కూడా అన్నానికి ఎసరైనా పెట్టగలరూ?"

"వా! వంటల్లోకూడ ప్రసిద్ధి పొందినవాళ్ళు మగాళ్ళేగాని ఆడాళ్ళున్నారా? నల భీమ పాకశాస్త్రం అన్నారుగాని సీతా సావిత్రి పాకశాస్త్రం అనలేదే?"

"అయితే చూద్దాం మీ ప్రావీణ్యత!"

"నీవే యిస్తావుకదూ సర్టిఫికేటు!"

"ప్యాసయితేగా?"

"సరే! ఇకపోయి పడుకో!"

"మరి అంతేగా ఈ వారం రోజులు నుంచీన్నీ"

"ఏం చెయ్యమంటావు స్వర్ణా! పరిస్థితులు విస్తరించానుగా"

"పోనీలెండి! రెండు మూడు రోజులు సెలవైనా తీయండి ఆనందంగా గడుపుదాం"

"శలవా? మిమ్మల్ని తీసుకు రావటానికీ ఎంతో ప్రయత్నించగా, మా పెద్దబాబు చెప్పగా, నాల్గు రోజులు శలవు యిచ్చాడు. తిరుగా ఈవారం పది రోజుల్లోనే అడిగితే చీవాట్లుతప్ప వేరులేదు. అదీగాక మా 'జనరలు సెక్షను'లో నలుగురం గుమస్తాలం. అందులో ప్రస్తుతం ఒకడు 'సిక్కు'లో నున్నాడు. బహుశా అతడు రేపు రావచ్చు. అతడు వచ్చిన తరువాత ప్రయత్నిస్తా"

"ఏదో అబద్ధంవో, సుబద్ధంవో చెప్పి, సంపాదించాలేగాని, ఊరుకుంటే వస్తుందా?"

"సరే! రాణీగారి ఆజ్ఞ అయింది కదూ! దాన్ని ఉల్లంఘిస్తే రాజ్యం 'కోర్టు ఆఫ్ వార్డ్సు' అయిపోదా మరి?"

"ఔను! అన్నట్లు చెయ్యపోకతే అంతే."

* * *

చాలా ప్రయాసం అయింది మూడురోజులు 'కాజుయల్ లీవు' దొరికేసరికి. ఆనందంతో ఆఫీసుపని కొరదా లేకుండా మరొక గంటన్నర అదనంగా పనిజేసి, యింటికి వచ్చాను ఈ శుభవార్త స్వర్ణతో చెబుదామని. గుమ్మంలో అడుగు పెట్టాకల్లా, అరుగుమూల రెండు గుడ్డల్తో, ఒక బిచాణాతో సహా, కూచుంది స్వర్ణ. నన్ను చూడగానే నవ్వుతూ "శలవు మాట ఏం వైంది?" అని ప్రశ్నించింది. "శాంక్షను అయేసరికి చుక్కలు రాలినాయి" అన్నాను.

"నాకూ మూడు దినాలు శలవు దొరికింది లెండి బయట కూచోడానికి."

"బస్! మంచి సమయమే చూశావు! ఇకేం వుంది ముచ్చట్లకు? మామూలు ప్రకారమేగా?"

"అది కాదు! మీపాకశాస్త్రి ప్రావీణ్యత తేట పడ్డానికి సమయం దొరికింది."

"అయితే ధన్యుణ్ణే!" అంటూ ఇంటిలోపలికి పోయాను. అప్పటికే సాయంత్రం అవడం చేతనూ, స్వర్ణకు రాత్రి భోజనం అవసరం లేకపోవడం చేతనూ, వంట ప్రయత్నం చేయలేదు. కాని పిల్లవాడు మాత్రం అన్నం తెమ్మని అల్లరి పెడతాడేమో అని తలచాను. బజారు నకువుళ్ళి పూరీలు పాలు అరటి పండ్లు తెచ్చినాను. అరటిపండ్లు చూడ్డంతో మా వాడికి అన్నం అవుసరం లేకపోయింది. ఆ రాత్రి అలా కాలక్షేపం జరిగింది.

తెల్లవారింది. కాల్యకృత్యాలు తీర్చుకొని, స్నానంజేసి, కాఫీ కాద్దామని పొయ్యిదగ్గరకు వెళ్లినాను. "బజారునుంచి కాఫీ, ఫలహారం, తీసుకు రాకూడదా?' అని స్వర్ణఅంది. పావలా అయిదణాలు ఉంటేగా ముగ్గురికీ టిఫిను పూర్తిగాదు. అదీ కాక అరటిపండ్లున్నాయి. ఒక్క కాఫీయే కదా? పావుగంటలో తయారైపోతుంది" అన్నాను. "సరే" అని ఊరుకుంది.

పోయి రాజవేసినాను. కాని వెలగదు. పొగ అంతటా క్రమ్ముకుంది. ఏం కనిపించదు, ఎంత ఊదినా వెలగటం లేదు. కండ్లల్లో పొగదూరి అల్లరి పెట్ట నారంభిం

చింది. కిరసనాయిలు పోస్తే మండుతుందని ఒక బుడ్డెడు నూనె ఒంపినాను. యథా ప్రకారమే! పొగతో కంపు సహాయపడ్డది. మరల రెండు మూడు మారులు ఊదినాను. అంతే! ఇంతలో ఎంత మావాడు ఆకలనిమారాం చేస్తున్నాడు. ఓదార్చినా ఊరుకోడు. మహా చికాకు కలిగింది. ఐదేళ్ళ వెధవకి ఇంత అల్లరా అని తీసిపెట్టి ఒక్క చెంపకాయ లాగినాను. బావురుమని ఏడవ నారంభించినాడు. రెండు చేతులూ పట్టుకొని, పైకి తెచ్చి, స్వర్ణ దగ్గర కుదబెట్టివేసినాను. ఆ ఊపువల్ల వెనక్కి పడిపోబోయాడు. ఆపుకోబోయాను. స్వర్ణకూడ ఆదుకొంది. మా చేతులు నాల్గూ కలుసుకున్నాయి. పిల్లవాడిని దగ్గరకు తీసుకుంటూ "గొప్ప పనిచేశారు! స్నానంచేసి మరి వెళ్ళండి యింటిలోకి" అంది రూక్షంగా. "అబ్బా! పొయి వెలగదాయె. పొగతో అల్లర పడుతూన్నాను. మధ్యను పీడి గోల" అన్నాను. కండ్లు తుడుచుకుంటూ, ముక్కు చీదుకొంటూ "అయ్యో! పావుగంట అయింది. ఇంకా పొయ్యే వెలగలేదా?" అంది వేళా కోలపు నవ్వుతో. నేనేమీ జవాబు చెప్పకుండా నూతి దగ్గరకు వెళ్ళిపోయినాను. స్నానంచేసి, యింట్లోకి వెళ్లుతూండగా" చిన్న కట్టె పుడక్కి, కిరసనాయిలులో ముంచిన గుడ్డనుచుట్టి, వెలిగించి, రాజుకొని ఉన్న పొయ్యిలో ఉంచండి. వెలుక్కుంటుంటుంది. అలా చేసినాను. అంటుకుంది, అని స్వర్ణ అన్నది. దాని ధర్మాన మరి ఆరలేదు. నీళ్లు సలసల మరుగుతాంది. కాఫీ డబ్బా ఎక్కడుందో వెదికినాను కనబడలేదు. స్వర్ణను అడిగాను, "వంటయింటి అలమారులో ఉంది" అని చెప్పింది. అలమారు తలుపు తెరచి చూచినాను. రెండు డబ్బాలున్నాయి. రెండూ కూడా 'పోల్సను కాఫీ' డబ్బాలే! ఒకటి నిండుగా ఉంది. రెండోది సగం ఉంది. వాడుకలో ఉంది ఇదేకదా అనుకొని, యింతగుండతీసి మరుగుతూన్న నీటిలో పోసినాను. మూత ఉంచినాను. రెండుమూడు నిమిషాలయాక, తపేలా దించి వడగట్టినాను. కాఫీ వాసన రాలేదు. పైగా ఏదో కొంచెం కసగా వాసన వేస్తూంది. పాత సరుకుగదా అని తలచాను. పాలు, పంచదార కలిపినాను. రంగుమాత్రం చాల బాగా ఉంది. స్వర్ణ చేసిన కాఫీకి ఈలాంటి రంగు ఎన్నడూ లేదు. నాలో కొంచెం గర్వం కలిగింది. కప్పుల్లో దాన్ని పర్ది, మిగతాది 'పాయ్'లో ఉంచి అరటిపండ్లు ఒలిచి, రెండు ప్లేట్లలో పెట్టి, స్వర్ణ దగ్గరకు వచ్చినాను.

"తయారైందా?" అని ప్రశ్నించింది.

"తయారా? ఏనాడైనా నీవు, ఈలాంటి రంగుతో, ఇంత మజాగా తయారుచేశావు?" అంటూ కప్పుతో కాఫీ, ప్లేటుతో "నాన్నతో నేను కాఫీ తాగనే" అనేకుర్రని ముందుంచినాను. నేను కాఫీ తాగనే" అంటూ మూతి బిగించుకు కూచున్నాడు మావాడు. "పోనీలే! మనం యిద్దరం తాగుదాం" అంది స్వర్ణ. దానివంతుకు వచ్చిన పండ్లలో అది ఒక్కటే తిన్నది. తక్కిన రెండూ మావాడు క్షణంలో కాజేసినాడు. నాదగ్గర ఒక్కటి ఖర్చు అయింది. వాడివేపు చూస్తూ "పండ్లు ఎవరికి కావాలె" అన్నాను ఊరిస్తూ. నావేపు ఒకసారి చూచి తల అవతలకు త్రిప్పుకున్నాడు. 'ఏం పంతం అనుకొని "ఎవరికీ వద్దూ! సరే! నేను కళ్లుమూసుకుంటాను. ఏ పిల్లి వచ్చి తీసుకుంటుందో" అన్నాను. చటాలున తల్లిదగ్గరనుంచి వచ్చినా ఎదుట ఉన్న ప్లేటును పట్టుకొని, నవ్వుతూ స్వర్ణ దగ్గరకు పారిపోయినాడు.

"ఏం బాగుందండీ కాఫీ!" అని ఒకసారి పీల్చి కప్పును దిగువబెట్టింది స్వర్ణ.

"మరేం అనుకున్నావు. ఎప్పుడైనా చేశావా ఇంత మజాగా."

"లేదు! ఎన్నడూ చేయలేదు. నిజంగా—ఆహా! ఏం రుచి?"

సగర్వంగా సాసరులో కొంచెం పోసి మావాడికిచ్చి, కప్పుతో నేన్స్వీకరించాను. కొంచెం పీల్చినాను. వికారంగా ఉంది. బ్రహ్మాండమైన కసగా ఉంది. స్వర్ణ పకాలున నవ్వింది. "అబ్బా! చేదూ" అంటూ మావాడు సాసరుతో ఎత్తి వేసినాడు.

"బలేగా ఉంది కదూ?" అంది స్వర్ణ, నాకు మాటవచ్చింది కాదు. కప్పులోని కాఫీవాసన చూస్తున్నాను.

"ఏంమజాగా ఉందండీ! మీరు గనక ఈలా తయారు చెయ్యగలిగారు! మరొకరైతే—"

నాకు ఉడుకుబోత్తనంవచ్చింది. కాని ఎంవైనా అంటే రసభంగం కలుగుతుంది. అయినా "ఏం జరిగిందో" అన్నాను నవ్వుతూ.

"ఏంజరిగిందా? దిగ్విజయం!"

"వేళా కోలంమాట కేంగాని చెబుదూ!"

"నాకేం తెలుసు!"

"అయితే అలమారులో రెండు కాఫీ డబ్బాలున్నాయి కదూ?"

"ఔను!"

"సరే! లోపందేంది?"

"డబ్బాలు రెండున్నాయి. కాని కాఫీ గుండ ఉన్నది మాత్రం ఒక్కటే!"

"రెండోది?"

"సీకాయ పొడి. స్నానాలకని"

"ఏది? ఆ సగం వుందా?"

"ఆఁ"

ఇప్పుడు బోధపడ్డది పొరపాటు!

"అయితే యిది సీకాయ పానీయం అన్న మాట?"

"మరేం చేయమంటావు? అడిగున్నప్పుడే నీవు చెప్పవలసింది. నేను రెండూ చూచాను. నిండుది ఎందుకు వాడడం. తక్కువది వాడుదాం కదా అని అది తీశాను."

"సరే కాని వాసన చూడరూ? పోనీ ఆ గుండ వేసినప్పుడైనా వాసన మీకు తెలిసింది కాదా?"

"అనుమానించాను కాని పాత సరుకు అవటంచేత అలా వుందేమో అని అనుకున్నాను."

"ఎంత పాత బడ్డా కాఫీ వాసన కొంచెం అయినా వేయదూ? ఏలాగో చేశారు! ఎవరూ చేయలేనంతపని?"

"ఆఁ యిక కొంచెం ఊరుకుందూ"

"ఊరుకోక మరేం? నలభీమ పాకశాస్త్రిలూ..."

"అప్పుడేనా యింత వెటకారం? ఏదో మొదటి తప్పు. ప్రమాదం ఎంతవారికీ సహజం-మధ్యాహ్నం చూద్దూ!"

"అబ్బో! ఇప్పుడు ఇంత వెలిగించారు యిక మధ్యాహ్నం వంట మిగిలింది. సరే యిప్పుడు టిఫిన్ మాట"

"బజారు........."

"మొదటే చెప్పానుగా! దండుగన్నారు"

"నీకు సందు దొరికితే చాలు" అని పావలా డబ్బులు ఖర్చు పెట్టి టిఫిన్ తెచ్చినాను. అప్పటికి ఆలా కాలక్షేపం అయినది.

* * *

ఈ తంతు అంతా తీరేసరికి తొమ్మిది గంటలైంది. తిరుగా నిప్పు వేసి వండడానికి బద్ధకంవేసింది. అలా అని వూరుకుంటే యిక లేదు స్వర్ణచేసిన ఆక్షేపణలకు. ఒక కాఫీ చేయటానికే అంత సేపుపట్టింది. అలాంటిది అన్నం, కూరా, చారు చేయటానికి ఎంతవేళ అవుతుందో! ఆలస్యానికి మేంటర్పుకోగలంగాని మా అల్లరబాజా (పిల్లవాడు) సంగతో? ఏలా అయినా ఇప్పుడు వంటప్రయత్నం అట్టే బాగులేదని ఆలోచించి చిన్న ఎత్తువేసినాను. బజారునకు వెళ్ళి కూర తెస్తానని స్వర్ణతో చెప్పి, ఇనిస్టిట్యూటునకు దారితీసినాను. పదకొండు గంటలవఱకు అక్కడ గడి

వేసి, ఇంటికి వచ్చినాను. గుమ్మంలో కాలుంచగనే "ఏం ఎత్తువేశారండీ?" అని ప్రశ్నించింది. కర్ణపిశాచీ ఉన్న దానిలా స్వర్ణ! ఆమాట నన్నొక్కసారి చకితుణ్ణిజేసింది. క్షణంలో మార్పును సరిజేసుకొని "ఎత్తా! అంగటిలో స్నేహితులు కలిసి ఇంత వఱకూ వదలకపోతే ఏం చెయ్యమంటావు?" అన్నాను ధీమాగా.

"అయితే నిప్పు వేస్తారా ఏమిటి?"

"ఇప్పుడా?"

"మరేం?"

"ఔను! ఆలాగే ఉంటుంది! త్రోవలో అయ్యారునకు చెప్పినాను కారియర్‌తో భోజనం పంపమని',

"రాత్రికి కూడా చెప్పేసి లేకపోయారా?"

"ఎందుకు? నేను మడిగడతాను కదూ?"

"ఏమో? అప్పటికి ఇంకెవరైనా కలిసి సినిమాకు తీసుకు వెళ్ళిపోతే?"

"అసలు బయటకు వెళ్లితేగా?"

"పోనీ లెద్దురూ! ఎందుకీ ప్రయాసం! ఈ రెండురోజులా అయ్యారుకి చెప్పేయండి"

"ఆఁ-నీ కంగింపులు నాకు తెలియవా ఏమిటి? రాత్రికేలా అయినా వండి నీ దగ్గరనుంచి బహుమానం-కాదుకాదు-సర్టిఫికేటు పుచ్చుకోవాలెగాని!"

"సరేలెండి చూద్దాం. కాని సీకాయ పానీయంలా మాత్రం చేయకండీ"

ఇంతలో భోజనం వచ్చింది. స్వర్ణకూ మా ఆవిడకీ వడ్డించి తరువాత నేను వడ్డించుకున్నాను. పూర్తి అయింది. కాని తిన్న తరువాత ఎంగిలి, ఆకుతీసి, స్థలం శుద్ధిచేసే సరికి ఎంతో ఆయాసంకలిగింది. ఈ లాంటి ఆయాసం, చీకాకు ఆడాళ్ళు ఏలా సహిస్తున్నారో అన్న ఆలోచన కలిగింది.

* * *

"అప్పుడే ఎందుకీ సరంజాం?"

"వంటకు?"

"నాలుగేనా అయింది?"

"అయితే! శీతాకాలం ప్రొద్దు కదా!" అంటూ వెళ్ళిపోయాను. ఇంకా ఉంటే బాతాఖానీ పెరుగుతుందని.

ఉదయం అంత చీకాకు లేకుండా పొయ్యి వెలిగించాను. ముందు అన్నం వండుదాం అని ప్లాను. బియ్యం కడిగి పళ్లెంలో ఉంచాను. నీరు బాగా మరిగింది. అందులో బియ్యం పోసి, మూత ఉంచినాను. కొంచెం సేపయాక కుతకుతమంటూ ఉడకనారంభించింది. అత్తెసరుదించుదాం అనిపించింది. మూతతీసి చూచినాను. నీరు తక్కువగా ఉన్నట్టయింది. కాని వార్చవలసిన అవసరంలేదనీ, ఆ నీటితో అది ఉడికిపోతుందనీ తలచి తిరుగా మూత పెట్టివేసినాను. కూర ఏమిటిచేద్దాం అనుకున్నాను. స్వర్ణ దగ్గరకు వెళ్ళి అడిగినాను.

"నాకు రాత్రికితిండి అనవసరం కదా? మీకు బాబుకేకదా! ఉరలగడ్డగాని వంకాయగాని వండండి. సుళువుగా తేలిపోతూంది"అని అంది. పచ్చి కారంపెట్టి వంకాయ కూర వండుదాం అనిపించింది. ఐదు వంకాయలుతీసి, అడ్డంగా నాలుగుకోతలు కోసి నీటిలో ఉంచినాను. తరువాత పచ్చికారం తయారుచేయాలె! ఏయే వస్తువులు ఉపయోగించటంవో తెలుసుగాని ఏలా తయారు చెయ్యటంవో తెలీదు. స్వర్ణకు అడిగితే నవ్వుతుంది. అదీకాక గడియ గడియకూ దాని సలహా తీసుకుంటే నాప్రజ్ఞ ఏమిటి? అని ఆలోచించి, వస్తువులన్నీ గుండ కొట్టినాను. కొంచెం నీళ్లువేసి, ముద్దగాచేసినాను. ఉల్లితరిగి దానికిచేర్చి, తరిగిన కాయల్లో కూరినాను. ఇదంతా అయేసరికి అన్నం సంగతి జ్ఞాపకం వచ్చింది. మూత తీసేకల్లా పక్కలంట మాడు కన్పించింది ఉడికిందో లేదో చూద్దాంవని గరిటెకోసం వెదికినాను. దొరకలేదు. వెంటనే అక్కడ ఒక లావుపాటి పుడకఉంటే దాన్ని నీటితో శుభ్రపర్చి, అన్నాని, కలిపి, కొంచెంతీసి చూశాను. సగం ఉడికింది. పలుకు జాస్తీగాఉంది. మరి కొంచెం నీళ్లుపోసి, ఆపుడకతో

బాగా కలిపి, మూత పెట్టినాను. పది నిముషాలకు తిరుగా ఉడకటం ఆరంభంమైనది. ఇక కూర వేపు తిరిగినాను. పళ్లెంలో అంతా తయారుగా ఉంది. పొయ్యి ఎక్కించటానికి. కాని, ఉప్పు వేశానా లేదా అని తలంపు కలిగింది. కలిపిన ముద్ద కొంచెం నాలుక మీద వేసినాను. నిజంగా ఉప్పు వేయలేదు. అన్నా! ముందే మేలుకోవటం మంచిదయింది. లేకపోతే స్వర్ణ ఎగతాళికి అంతే లేకపోయి ఉండును. ఆల్మరాలో ఉప్పు సీసా తీసినాను. కాని దాని ప్రక్కనే వేరొకటి అలాంటిదే ఉంది. వెంటనే ఉదయం కాఫీ డబ్బాలు జ్ఞాపకానికొచ్చాయి. రెండు సీసాలు తెరచి చూచినాను. ఒకటి ఉప్పు, తక్కింది పంచదార. మూతలు పెడుతూండగా మావాడు వచ్చి "న్నాన్నా! పైసా యియ్యవూ! మురీ లడ్డూ కొనుక్కుంటాను" అన్నాడు. 'ఇస్తాన'ంటూ, ఒక సీసా తీసి దిగువను ఉంచి, గది లోనికి వచ్చి వాడికి కానీ యిచ్చినాను. పిమ్మట కాయల్లో కూరిన కారపు ముద్ద పైకి తీసి, ఉప్పు కలిపి యథాప్రకారంగా తిరుగా కాయల్లో కూరినాను. అన్నం ఉడికేదాక విశ్రాంతి తీసుకున్నాను. మూత తీసి అన్నం చూచాను. కలపడానికి ఉంచిన పుడక అందులో పడి ఉంది. అది బయటకి తీసి, దానికి అంటుకు ఉన్న అన్నం పట్టి చూచినాను. మెత్తగా ఉడికింది. అంటే కొంచెం ముద్దగా ఉంది. చల్లారితే అదే బాగుంటుందని, దిగువకు దించివేసి కూర ఎక్కించాను. ఎక్కువగా నూనె వేసి, పోపు వేగిన తరువాత కాయలు అందులో పడేసినాను. కొంచెం నీరు కూడా పోసినాను. మూత పెట్టి బయటకు వచ్చినాను. అప్పటికి 5 1/2 గంటల టైము అయింది. వంట పూర్తి అయిందనొచ్చు. ఉదయం కన్నా, ప్రోగ్రెస్ బాగా ఉందని సంతోషించా. స్వర్ణ దగ్గరకు వచ్చినాను.

"అయిపోయిందా ఏంటి వంట?"

"రమారమి"

"కూర ఏం జేశారు?"

"పచ్చికారం పెట్టిన వంకాయ!"

"అబ్బో! పెద్ద వంటే!"

"మరేంటనుకున్నావు! ఇంతకూ నీకు ప్రాప్తం లేదుగా?"

"ఏం?"

"రాత్రులు తినవుకదూ?"

"కూరకు తప్పలేదులెండి! పూరీల్తో నంజుకుంటాను"

"అయితే పూరీలు చేయమంటావా ఏమిటి?"

"ఎందుకూ? అణాయిస్తే ఆరు దొరుకతవి!"

"అలాగే కాని!"

"పొయ్యి మరేం అల్లర చేయలేదు కదా?"

"ఎందుకు చేస్తుంది? నీలాగా అదీ కూడ మాటమాటకూ వేళాకోళం చేస్తుందా ఏంటి?"

అంటూ కూర ఉడికిందేమో అని లోనికి వెళ్ళినాను. మూత తీసినాను. మంచి వాసన వేస్తూంది. స్వర్ణను బాగా ఉడికిద్దాం అనుకున్నాను. క్రిందికి దించివేసినాను.

ఆరు గంటలైంది. ఆకలేస్తుందని మావాడు అల్లర చేయనారంభించినాడు. బజారునకు వెళ్ళి, స్వర్ణకు, పూరీలు పాలు తెచ్చి, మా వాడి సొద తీరుద్దామని లోనికి వెళ్ళినాను.

"విస్తట్లో అన్నం కూరా వేసి నా దగ్గర ఉంచేయండి. బాబుకు తినిపిస్తాను." అంది స్వర్ణ.

అన్నం తపేళా దగ్గరకు వెళ్ళినాను. విస్తట్లో వేదాం అని కదిపినాను. కదలలేదు. చేయి పెట్టినాను. వేడిగా ఉంది. గరిటె వెదికి తెచ్చి తీసినాను. అది అన్నం కాదు. పేస్టు ముద్ద. ఎంత దులిపినా, గరిటె నుంచి విస్తరిలో పడదు. ఎలాగో నాలుగైదు గరిటెలు వేసినాను ఉండ్రాళ్లవలె విస్తరిలో నుంచి చూస్తున్నాయి నావేపు. ఆ చూపుల భావం- "నీవు మాంచి పాకశాస్త్ర ప్రవీణుడవు"-అన్నట్టున్నాయి. తరువాత కూర! ఒక వంకాయ తీసినాను. నఖం ఉడికింది. కాయల్లో కూరిన ముద్ద కనపడ్డంలేదు. తపేలాలో చూచినాను. తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం అన్నట్టుగా, కాయలకు కాయలు, ముద్దకు ముద్ద పడి

ఉన్నాయి. కాయలకు సహజంగా (పచ్చివిగా ఉన్నప్పుడు) ఉండుకున్న మొద్దుతనానికి తోడు, నా చేతిలో పడ్డంచాత మరింత బిరుసుతనం కలిసింది. అవికూడా "సీడాబులయింతేనా?" అని వేళాకోళం చేస్తున్నట్టున్నాయి. సగం అనుమానంతో ఆవిస్తరి తీసుకువెళ్ళి స్వర్ణ ముందు ఉంచినాను.

"ఇవేమిటి ఈ ఉండ్రాళ్లముద్దలు" చిర్నవ్వుతో అంది స్వర్ణ.

"చల్లపడితే బాగుంటుంది"

"చూశారా? విడదీస్తే విడకుండా ఉన్నయి. పైగా చేతికి అంటుకొని 'నేను కదలను–మెదలను' అంటూన్నాయి"

"కొంచెం ముద్దగా ఉంది! అంతే కదూ!"

"సరే! ఇది ఏమిటి?"

"పచ్చికారం పెట్టిన వంకాయకూర"

"ఓహో! ఇదా? పచ్చి వంకాయ, కారం, మిగిలినాయి. ఉడకటం–కూర. దేవుడికి ఆరాధన అయిపోయింది"

"పోనీ రుచిచూద్దూ"

"ఏమిటి? పచ్చి వంకాయా? లేక కారం ముద్దా? రుచిచూడ్డం! సరే తొందరెందుకు?"

ఏలాగో ఆ అన్నం ముద్దలో, కొంచెం కారం ముద్దకలిపి పిల్లవాడికి పెట్టింది. నోటిలో ఉంటూండగానే అబ్బోయ్! చేదూ! నా కొద్దనాయినా?" అంటూ ఉమ్మివేసి నాలుక తుడుచుకోవటానికి ఆరంభించినాడు. ఇదేమిట్రా ఇదంతా అని నేనొక స్తూపంలా నిబడి పోయాను. చిన్ననవ్వుతో "వ్రతంమాట దేవుడెరుగునుగాని, మావారి పాకశాస్త్ర ప్రావీణ్యం తెలుసుకోవాలె" అంటూ ఆకూరకలిపిన అన్నం ముద్ద నోట్లో వేసుంకుంది స్వర్ణ. కొంచెం మెదిపి "అబ్బా!" అని పచ్చి నారింజకాయ తిన్నదానిలా ముఖాన్ని ప్రదర్శించి ఛీత్కారం జేసింది.

"ఏం?" అన్నాను జంకుతూ.

"ఏం వీలేదు. ఆ అన్నం, ఆకూర ఆరుచులు వాటి ప్రభావం నావంటి మానవ మాత్రురాలు భరించలేదు. దైవ స్వరూపులైన మీరు భరించగల రేమో?"

"అబ్బా! ఎందుకీ చదువు? సంగతిచెబుదూ?"

"మీరొకసారి రుచి చూడండి. తెలుస్తుంది"

"నీవు చెప్పాదూ!"

"నమ్మరేం మో"

"ఎందుకు నమ్మనూ"

"అన్నం ముద్దగావున్నా, విపరీతం అయిన చేదు. వంకాయ పచ్చివంకాయే! కొంచెం అయినా ఉడకటంలేదు. పోనీ దాన్నివదిలి, ఆ కారం రుచి చూస్తే, ఉప్పులేదు. మీదు మిక్కిలి తీయగాఉంది. మొత్తంమీద, తీపు చేదులకు సమ్మేళన కలిగించినారు"

మాటాడకుండా, ఇంట్లోనికివెళ్లి వాటివాటి రుచులు చూచినాను. స్వర్ణ చెప్పింది సరిపోయింది! అయితే ఈ గోల్మాలు ఏలా కలిగిందని ఆలోచించాను. దగ్గరనే అన్నంలో పడ్డ పుడక కన్పించింది. చూస్తే అది వేపపుడక మరేంఉంది? దానివల్ల అన్నం సంగతి తేలింది. ఇక కూరో? ...బోధ పడ్డది! రుచిచూచి కూడా మధ్యను కానీ గురించి మావాడు రావటంలో మరచి పంచదార సీసా తీసి ఉప్పు అని వేసినాను సరిపోయింది. రెంటికి రెండూన్ను ఏం చెయ్యటం? ఓటమి ఒప్పుకోడానికి స్వర్ణదగ్గరకు వచ్చినాను. సంగతులు చెప్పినాను. నవ్వుతూ సగర్వంగా "పాకశాస్త్ర నిపుణులా?" అని సంబోధిస్తూ" సర్టిఫికేటు కావాల్నా" అని అడిగింది.

"అక్కరలేదు! జయపత్రిక తమకే అర్పిస్తాను. ఓటమి ఒప్పుకుంటూ" అన్నాను మందహాసం చేస్తూ.

"గ్రహించారా వంటలో సులభ సాధ్యాలు–"

మరి ఆ మాట వినిపించుకో

కుండా, లోపలికి వెళ్ళి, వాటి ఖర్మా నికి విచారించండని తపేలాలు బయటపడేసి, బజారునకు వెళ్లి, మరి కొంత పాలు, మిఠాయిదినుసులు, పూరీలు తెచ్చి, తిన్నాం. అయితే పాలులో వేదాంఅని పంచదారసీసా తీయబోయి ఉప్పుసీసా తీసినాను. కాని దాన్ని రుచిచూచి, దూరంగా ఉంచేసి పంచదారతీసి, కలిపినాను. పాలు నోటిదగ్గర పెట్టుకుంటూ, పంచదారకు బదులు ఉప్పువేసే లేదుకద'' అని అడిగింది స్వర్ణ!

"లేదు! ముందుగానే జాగ్రత పడ్డాను'' అన్నాను.

మరునాడు మాత్రం చక్కగా హోటలునుంచి, ఉదయాన కాఫీ ఫలహారాలు, మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు తెప్పించుకొని ఆరగించాం.

రెండు రోజుల 'కాజుయల్ లీవు' ఈలా గడిచిపోయింది. మూడో రోజు, స్వర్ణ యింటికివచ్చింది. జరిగిన సంఘటనాలు తలంచుకొంటూ, సరస సల్లాపాల్తో, చాల సరదాగా, మూడో రోజు 'కాజుయల్ లీవు' గడిపాం.


# అయఃకాంత ద్రావకం

ధాతువృద్ధికి సేవింపదగినది ద్రావకము ఇనుము. ఇనుము తిన్నవారికి నీరసము, ముసలితనము లేదని అగస్త్యాదులు వచించియున్నారు. కావున దీనిని సేవించుటచే భీమబలము సిద్ధించును.



ద్రావక సేవనమువలన గలుగు గుణములు.

ఉష్ణముచే వెంట్రుకలు రాలుకుండ ఆగును, కాలుచేతులు, కండ్లమంటలు పోవును, ముఖమునకు తేజస్సు నిచ్చును, వాతమును, ఉష్టమును పోగొట్టును, కాళ్ళు చేతుల దుర్బలము నణచి నొప్పును పోగొట్టును ఆకలిని జీర్ణశక్తిని కలిగించును. సడలిన నరములకు సత్తువ జేయును గుల్మము, గుండెనొప్పి కలవారు ఈ అయఃకాంత ద్రావకమును 8 రోజులు సేవించినచే జాలును ధాతుపుష్టి లేని వారు 40 రోజులు సేవించిన జాలును.

(అర్ధ మండలం) 20 రోజులకు మందు 1-0-0.

(1 మండలం) 40 రోజులకు వచ్చుమందు 1-12-0.

## ఆర్యా బుక్ డిపో,

తిరువళ్ళిక్కేణి, :: :: మదరాసు.